సాక్షి
ప్రకాశం

శనివారం । 20 । ఏప్రిల్ । 2024



కనిగిరిలో అధికారుల ఓవరాక్షన్

ఎన్నికల నిబంధనల పేరుతో కనిగిరిలో అధికారులు ఓవరాక్షన్ చేశారు. - 8లో..



వైఎస్సార్ సీపీని గెలిపిస్తేనే అభివృద్ధి

వైఎస్సార్ సీపీని గెలిపిస్తేనే అభివృద్ధి జరుగుతుందని మంత్రి సురేష్ అన్నారు. - 8లో..

వాతావరణం

గరిష్టం/కనిష్టం 42/27

పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. వాతావరణం ఉక్కపోతగా ఉంటుంది. వేడిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

22 నుంచి డైట్ సెమిస్టర్ పరీక్షలు

ఒంగోలు సెంట్రల్: జిల్లాలోని మైనంపాడు డైట్ డీఈఐడీడీ సెమిస్టర్, మూడో సెమిస్టర్ పరీక్షలు ఈనెల 22 నుంచి నిర్వహిస్తారని జిల్లా విద్యాశాఖాధికారి సుభద్ర తెలిపారు. మొదటి సెమిస్టర్ పరీక్షలు మధ్యాహ్నం 2 నుంచి 4.3 గంటల వరకు, మూడో సెమిస్టర్ పరీక్షలు ఉదయం 9 నుంచి 11.30 గంటల వరకు జరుగుతుందని చెప్పారు. అందుకు సంబంధించిన హాల్ టికెట్స్‌ను వెబ్ సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు.

విద్యార్థులలో నైపుణ్యం పెంపుదలకు ప్రేరణ పోటీలు

- జిల్లా విద్యాశాఖాధికారి డి సుభద్ర



పోటీలను ప్రారంభిస్తున్న జిల్లా విద్యాశాఖాధికారి

ఒంగోలు సెంట్రల్: విద్యార్థుల్లో నైపుణ్యం, పోటీతత్వం పెంచేందుకు ప్రేరణ పోటీలు ఉపయోగపడతాయని జిల్లా విద్యాశాఖాధికారి డీ సుభద్ర అన్నారు. జవహర్ నవోదయ విద్యాలయంలో శుక్రవారం జిల్లా స్థాయి ప్రేరణ ఉత్సవాలు నిర్వహించారు. జిల్లా విద్యాశాఖాధికారి డీ సుభద్ర ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. పరిశీలకులు మాధవీలత మాట్లాడుతూ ప్రేరణ పోటీల లక్ష్యాలను వివరించారు. పోటీల్లో ఎంపికైన విద్యార్థులకు గుజరాత్‌లోని వాద్ నగర్‌లో ఐదు రోజుల పాటు రెసిడెన్షియల్ శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. నవోదయ ప్రిన్సిపాల్ కే రామిరెడ్డి మాట్లాడుతూ నాయకత్వ, సృజనాత్మకత లక్షణాలు పాఠశాల స్థాయి నుంచే అలవడుతాయని చెప్పారు. 76 మంది విద్యార్థులు హాజరయ్యారు. జిల్లా అకడమిక్ మానిటరింగ్ ప్రోగ్రామింగ్ అధికారి ఎం రమేష్, అసిస్టెంట్ ప్రోగ్రాం మానిటరింగ్ అధికారి సీహెచ్ మాధవీలత పాల్గొన్నారు.

మంచి ముహూర్తం..

- రెండో రోజు భారీగా నామినేషన్లు
- ఒంగోలు పార్లమెంట్‌కు నిల్
- అసెంబ్లీ స్థానాలకు 15
- గిద్దలూరులో కేపీ నాగార్జున రెడ్డి నామినేషన్ దాఖలు
- కొండపిలో మంత్రి ఆదిమూలపు తరఫున వైఎస్సార్ సీపీ నాయకులు ఒక సెట్టు



నామినేషన్ దాఖలు చేస్తున్న గిద్దలూరు ఎమ్మెల్యే అభ్యర్థి కేపీ నాగార్జునరెడ్డి, చెవిరెడ్డి భాస్కరరెడ్డి

సాక్షి ప్రతినిధి, ఒంగోలు/ఒంగోలు అర్బన్: నామినేషన్ల ప్రక్రియ రెండో రోజు శుక్రవారం ఏకాదశి మంచి రోజు కావడంతో జిల్లాలో భారీగా నామినేషన్లు దాఖలయ్యాయి. ఒంగోలు పార్లమెంట్‌కు ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదు. ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలకు 15 నామినేషన్లు వచ్చాయి. జిల్లాలో అధికార వైఎస్సార్ సీపీ, టీడీపీకి చెందిన పలువురు అభ్యర్థులు, స్వతంత్రులు నామినేషన్లు దాఖలు చేశారు.

జనసంద్రమైన గిద్దలూరు:

వైఎస్సార్ సీపీ గిద్దలూరు అసెంబ్లీ అభ్యర్థిగా మార్కాపురం ఎమ్మెల్యే కేపీ.నాగార్జున రెడ్డి శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. స్వచ్ఛందంగా తరలివచ్చిన అభిమానులు, కార్యకర్తలతో నిర్వహించిన భారీ ర్యాలీలో ఒంగోలు పార్లమెంట్ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి, ఒంగోలు పార్లమెంట్ సమన్వయకర్త చెవిరెడ్డి భాస్కర రెడ్డి, కేపీ నాగార్జున రెడ్డి పాల్గొన్నారు. గిద్దలూరు అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారికి కుందురు నాగార్జున రెడ్డి ఒక సెట్ నామినేషన్ దాఖలు చేశారు. ఆయనతో పాటు ఆయన కుటుంబ సభ్యులు కుందురు కల్పన కూడా వైఎస్సార్ సీపీ తరపున మరో సెట్టు దాఖలు చేశారు.

కొండపిలో మంత్రి ఆదిమూలపు తరుపున..

కొండపి అసెంబ్లీ నియోజకవర్గానికి వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ తరఫున కొండపి నియోజకవర్గానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు ఒక సెట్టు నామినేషన్ దాఖలు చేశారు. పార్టీ నాయకులు కొండపి తహశీల్దార్ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి ఏ.కుమార్‌కు మధ్యాహ్నం 12.25 గంటలకు నామినేషన్ పత్రాలు సమర్పించారు. మంత్రి ఆదిమూలపు సురేష్ నామినేషన్‌ను ప్రపోజ్ చేసిన వారిలో రాష్ట్ర వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి ఎన్నాబత్తిన వెంకటేశ్వర రావు(చిన్నా), రాష్ట్ర నాయకులు డాకా పిచ్చిరెడ్డి, కొండపి జెడ్పీటీసీ సభ్యురాలు మారెడ్డి అరుణ కుమారి రెడ్డి, పొన్నలూరు జెడ్పీటీసీ సభ్యుడు బెజవాడ వెంకటేశ్వర్లు ఉన్నారు.



కొండపి ఆర్‌ఓకు మంత్రి సురేష్ తరపున నామినేషన్ పత్రాలు అందిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

అసెంబ్లీకి పలువురు నామినేషన్లు

జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో టీడీపీ అభ్యర్థులు, పలువురు స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్లు వేశారు. టీడీపీ తరుపున యర్రగొండపాలెం అసెంబ్లీ అభ్యర్థిగా గూడూరి ఎరిక్షన్ బాబు రెండు సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. దర్శి టీడీపీ అసెంబ్లీ అభ్యర్థిగా లక్ష్మీ గొట్టిపాటి ఒక సెట్టు నామినేషన్ వేశారు. సంతనూతలపాడు అసెంబ్లీకి టీడీపీ అభ్యర్థిగా బొమ్మాజి నిరంజన్ విజయ కుమార్ ఒక సెట్టు, కొండపి అసెంబ్లీకి టీడీపీ అభ్యర్థిగా ప్రస్తుత ఎమ్మెల్యే డాక్టర్ డోలా బాల వీరాంజనేయ స్వామి ఒక సెట్టు నామినేషన్ దాఖలు చేశారు. ఆయన తరవున డోలా కుటుంబ సభ్యులు డోలా రాజేశ్వరి కూడా ఒక సెట్టు నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. గిద్దలూరు అసెంబ్లీకి టీడీపీ అభ్యర్థిగా ముత్తుముల అశోక్ రెడ్డి ఒక సెట్టు నామినేషన్ దాఖలు చేశారు. గిద్దలూరుకు స్వతంత్ర అభ్యర్థులు లక్ష్మీ రామ నాయక్ ముదావత్, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా తరపున జువ్వాది పవన్ కుమార్, మార్కాపురంలో స్వతంత్ర అభ్యర్థిగా పొట్టి వెంకట సుబ్బారావు, ఒంగోలు అసెంబ్లీకి కాంగ్రెస్ అభ్యర్థిగా బుట్టి రమేష్ బాబు, స్వతంత్ర అభ్యర్థిగా మన్నం సుధీర్ కుమార్‌లు నామినేషన్లు దాఖలు చేశారు. తొలిరోజు ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గంతో పాటు 8 అసెంబ్లీ స్థానాలకు 13 మంది నామినేషన్లు దాఖలు చేశారు. దీంతో రెండు రోజులు కలిపి మొత్తం 28 నామినేషన్లు దాఖలయ్యాయి.

స్వామికి ఉంది డొక్కు కారేనట

మరుగుదొడ్ల సొమ్మును భారీగా కాజేసిన కొండపి ఎమ్మెల్యే డోలా బాల వీరాంజస్వామికి 2013 మోడల్ మారుతి కారు మాత్రమే ఉందని ఆఫిడవిట్‌లో పొందుపరిచాడు. తన దగ్గర రూ.1.26 లక్షల నగదు, తన భార్య వద్ద రూ.27 వేల నగదు మాత్రమే ఉన్నట్లు చూపించాడు. భార్యభర్తల పేరుపై రూ.47 లక్షల విలువైన చరాస్తులు, సుమారు రూ.35 లక్షల విలువైన చరాస్తులు ఉన్నట్లు చూపించాడు. స్వామిపై వివిధ పోలీస్‌స్టేషన్లలో 9 కేసులు నమోదై ఉన్నాయి. మరుగుదొడ్ల నిర్మాణం పేరుతో రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా భారీగా సొమ్ము కాజేసిన స్వామి..ఎన్నికల ఆఫిడవిట్‌లో చూపిన వివరాలు చూసి ప్రజలు అవాక్కవుతున్నారు.

అశోక్‌రెడ్డిపై దొమ్మీ కేసు..

వాహన దగ్ధం, దొమ్మీ..ట్రెస్‌పాస్ కేసులు..ఇవీ గిద్దలూరు టీడీపీ అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి చరిత్ర. అశోక్‌రెడ్డిపై గిద్దలూరు పోలీస్‌స్టేషన్‌లో పలు సెక్షన్ల కింద ఉన్నాయి. అలాగే బాపట్ల జిల్లా మార్టూరు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదై ఉంది. అశోక్‌రెడ్డి వద్ద రూ.3.50 లక్షల నగదు, భార్య పుష్పలీలా వద్ద రూ.6.68 లక్షల నగదు చేతిలో ఉన్నట్లు ఆఫిడవిట్‌లో చూపించారు. అశోక్‌రెడ్డి పేరుపై రూ.3.93 కోట్లు, భార్య పేరుపై రూ.2.59 కోట్లు చరాస్తులు చూపించారు. ఇద్దరి వద్ద సుమారు రూ.4.40 కోట్ల విలువైన స్థిరాస్తులు ఉన్నట్లు పేర్కొన్నారు.

తాగి..తూగి

- యర్రగొండపాలెంలో ఏరులై పారిన మద్యం



పుల్లలచెరువు రోడ్డులోని బ్రాందీషాపు వద్ద మద్యం కోసం ఎగబడుతున్న తెలుగు తమ్ముళ్లు

యర్రగొండపాలెం: టీడీపీ అభ్యర్థి గూడూరి ఎరిక్షన్ బాబు నామినేషన్ దాఖలు సందర్భంగా శుక్రవారం పట్టణంలో మద్యం ఏరులై పారింది. నామినేషన్‌కు ముందు పట్టణంలో టీడీపీ నేతలు ర్యాలీ నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే కార్యకర్తలకు ముందుగానే మద్యం కేసులతోపాటు డబ్బులు కూడా ఇచ్చారు. వారికి మాంసంతో కూడిన భోజనాలు కూడా ఏర్పాటు చేశారు. పట్టణంలో ఏ సందులో చూసిన తెలుగు తమ్ముళ్లు మద్యం తాగుతూ కనిపించారు. బ్రాందీ షాపుల వద్ద క్యూ కట్టారు. పూటుగా మద్యం తాగిన వీరు ర్యాలీలో చిందులు తొక్కారు. ర్యాలీలో పాల్గొన్నవారి సంఖ్య అంతంత మాత్రమే అయినా పచ్చ నేతలు మాత్రం నియోజకవర్గం అంతా తమ వెనకే నడుస్తుందన్న బిల్డప్ ఇచ్చారు. తాగిన మైకంలో వారు పట్టణంలో ద్విచక్ర వాహనాలపై ట్రిబుల్ రైడింగ్ తో హల్‌చల్ చేశారు. ఒక ద్విచక్ర వాహనంపై త్రిపురాంతకం మండలంలోని మానేపల్లికి చెందిన ముగ్గురు మితిమీరిన వేగంగా నడుపుతూ రామసముద్రానికి సమీపంలో ఉన్న స్పీడ్ బ్రేకర్ వద్ద బోల్తాపడ్డారు. ఈ సంఘటనలో బైరెడ్డి నరసింహారెడ్డి, పోట్ల మల్లికార్జున రెడ్డిలకు తీవ్రంగా గాయాలయ్యాయి. వీరిని యర్రగొండపాలెంలోని టీడీపీ నాయకుడు మన్నె రవీంద్రకు చెందిన వైద్యశాలలో చేర్పించి చికిత్స చేయించారు. గాయపడిన వారిలో బైరెడ్డి నరసింహారెడ్డి పరిస్థితి విషమంగా ఉండటంతో అతనిని పల్నాడు జిల్లా నరసరావుపేటలోని ఒక ప్రైవేటు వైద్యశాలలో చేర్పించారు. ఆ వైద్యశాలలో ఆయన కోమాలోకి వెళ్లినట్లు తెలిసింది.

కనిపించని కూటమి జెండాలు..

టీడీపీ ర్యాలీలో కూటమి జెండాలు కనిపించలేదు. ర్యాలీని రక్తికట్టించటానికి నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో వాహనాలు ఏర్పాటు చేసి జనసమీకరణ చేశారు. వారు అనుకున్న మేరకు కార్యకర్తలు రాకపోయినా స్థానిక టీడీపీ కార్యాలయం నుంచి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో అన్నీ పచ్చ జెండాలే కనిపించాయి కానీ జనసేన, బీజేపీలకు చెందిన జెండాలు కనిపించలేదు. ఈ సందర్భంగా స్థానిక కొలుకుల సెంటర్‌లో కాన్వాయ్‌పై నుంచి ఎరిక్షన్‌బాబు, ఒంగోలు పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులురెడ్డి తమ ప్రసంగాల్లో టీడీపీ కార్యకర్తలతోపాటు జనసేన, బీజేపీలకు చెందిన కార్యకర్తలు భారీ ఎత్తున పాల్గొన్నారని, ఎమ్మార్పీఎస్ తమకు మద్దతు ఇస్తుందని ఆయా పార్టీలకు చెందిన నాయకులను మాత్రం పరిచయం చేశారు.



చెట్లకింద చేరి మద్యం తాగుతున్న పచ్చదండు

పేదలకు విద్య, వైద్యం అందించటమే లక్ష్యం

- అర్హులందరికీ ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలు
- మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని
- ఒంగోలు నగరంలోని 16వ డివిజన్‌లో 'మన ఒంగోలు-మన వాసన్న'



16వ డివిజన్ అగ్రహారం గేటు, బాలాజీనగర్‌లో ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే, మాజీమంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి

ఒంగోలు సబర్బన్: పేదలకు విద్య, వైద్యం సంతృప్తిగా అందించటమే లక్ష్యంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం 58 నెలల పాలనలో ముందుకు సాగిందని మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస రెడ్డి చెప్పారు. ఈ మేరకు బాలినేని మన ఒంగోలు-మన వాసన్న కార్యక్రమంలో భాగంగా బాలాజీ నగర్‌లో శుక్రవారం ఇంటింటి ప్రచార కార్యక్రమాన్ని చేపట్టారు. 16వ డివిజన్ కార్పొరేటర్ శ్రీరాం నాగభూషణంతో కలిసి అగ్రహారం గేటు అవతల బత్తులవారికుంట, బ్రాహ్మణ బజారు, వార్డు సచివాలయం వీధి, మిట్టమీద, దత్తాత్రేయ కాలనీ, అరవ కాలనీలలో నుంచి ప్రచార కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా బాలినేనికి స్థానికులు హారతులు, పూల వర్షంతో, గుమ్మడి కాయలు దిష్టి తీసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా బాలినేని మాట్లాడుతూ సామాన్యులు అనారోగ్యం పాలైతే ఆర్థిక స్థోమత లేనప్పుడు అప్పులు చేసి మరీ కుటుంబ సభ్యులను కాపాడుకోవాల్సిన పరిస్థితి ఉంటుందన్నారు. ఆ పరిస్థితికి చరమగీతం పాడుతూ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అన్ని రకాల వ్యాధులకు ఆరోగ్య శ్రీలో అవకాశం కల్పించటంతో పాటు ఆరోగ్య శ్రీ ఖర్చు దాదాపు రూ.25 లక్షల వరకు ప్రభుత్వమే భరించేలా ఉత్తర్వులు జారీ చేశారన్నారు. అదేవిధంగా విద్య విషయంలో కూడా సీఎం వైఎస్ జగన్ ఏ రాష్ట్రంలో చేపట్టని విధంగా ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిషు మీడియంతో పాటు నాడు-నేడు కింద ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దారని గుర్తు చేశారు. వాటితో పాటు అమ్మ ఒడి పేరుతో పిల్లలను పనికి పంపకుండా బడికి పంపేందుకు ఆర్థిక సాయం చేయటం కూడా మరెక్కడా లేదన్నారు. చిన్నారులకు బూట్ల నుంచి దుస్తులు, సాక్సులు, టై అందజేసి విద్యను ప్రోత్సహిస్తున్నారన్నారు. గ్రామ, వార్డు సచివాలయాలను గడప ముంగిటకే తీసుకొచ్చి పరిపాలనను గ్రామాల్లోనే కొనసాగించారని చెప్పారు. ఒంగోలు నగరాన్ని ఎంతగానో అభివృద్ధి చేశానన్నారు. రానున్న ఎన్నికల్లో తనను అఖండ మెజారిటీతో గెలిపించి ఆరోసారి గెలిపించి తనచేత సిక్సర్ కొట్టించాల్సిన బాధ్యత ఒంగోలు నియోజకవర్గ ప్రజలపై ఉందన్నారు. 16వ డివిజన్‌లో జరిగిన అభివృద్ధి గురించి ప్రతి ఇంటి వద్ద బాలినేని వివరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కసుకుర్తి ఆదెన్న, ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత, వైఎస్సార్ సీపీ ఒంగోలు నగర అధ్యక్షుడు కఠారి శంకర్, 16వ డివిజన్ కార్పొరేటర్ శ్రీరాం నాగభూషణం, డివిజన్ అధ్యక్షుడు పోట్లూరి భాస్కర్, అడపాల రాము, వాకా కృష్ణారెడ్డి, గొర్రెపాటి శ్రీనివాసరావు, బొట్ల సుబ్బారావు, తమ్మినేని మాధవి, నారాయణ, తోటకూర రాజేష్, వంశీకృష్ణ, వెంకటేశ్వర్లు, సురేష్, కుమార్, ఇసాకు, ఏసు, విజయ్, వంశీ, పాజర్ల నాగరాజు, అశోక్ బాబు, సుబ్బయ్య, బాల గురవయ్య, పురిణి ప్రభావతి, లక్ష్మయ్య, గుర్రాల రామ్మోహన్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

ఆశీర్వదించి అండగా నిలవండి

- గిద్దలూరు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తా
- వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా కేపీ నాగార్జునరెడ్డి నామినేషన్ దాఖలు
- పాల్గొన్న ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కరరెడ్డి



ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి కేపీ నాగార్జునరెడ్డి, ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి

గిద్దలూరు రూరల్: ప్రజలు ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఆశీర్వదించి అండగా నిలిస్తే గిద్దలూరు నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే కేపీ.నాగార్జునరెడ్డి అన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గిద్దలూరు ఎమ్మెల్యే అభ్యర్థిగా కేపీ.నాగార్జునరెడ్డి శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. ముందుగా పట్టణంలోని ఆయన నివాస గృహం వద్ద నుంచి రాచర్ల రోడ్డులోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అక్కడ నుంచి ర్యాలీగా ప్రత్యేక వాహనంలో బయలుదేరారు. ఒంగోలు ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కరరెడ్డి కూడా వారితో కలిసి ఊరేగింపుగా వచ్చారు. దీంతో వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకులు మరింత ఉత్సాహంగా ముందుకు కదిలారు. చెవిరెడ్డి భాస్కరరెడ్డి, నాగార్జునరెడ్డిలు కలిసి జయరామ్ లాడ్జి వద్ద వాహనం దిగి అక్కడ నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు వెళ్లి నామినేషన్ వేశారు. నామినేషన్ కార్యక్రమానికి నియోజకవర్గ వ్యాప్తంగా పెద్ద ఎత్తున అభిమానులు స్వచ్ఛందంగా తరలివచ్చారు. ఈ సందర్భంగా కేపీ.నాగార్జునరెడ్డి మీడియాతో మాట్లాడారు. జగనన్న మీ పై నమ్మకంతో గిద్దలూరు అభ్యర్థిగా నిలబెట్టారని, నియోజకవర్గ ప్రజలు తనను ఎమ్మెల్యేగా, చెవిరెడ్డి భాస్కరరెడ్డిని ఎంపీగా అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆకాంక్షించారు. కేపీ.నాగార్జునరెడ్డి, ఆయన సతీమణి కుందురు కల్పన విడివిడిగా రెండు సెట్ల నామినేషన్లను రిటర్నింగ్ అధికారి డి.నాగజ్యోతికి అందజేశారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్ పాముల వెంకట సుబ్బయ్య, వైస్ చైర్మన్లు ఆర్.డి.రామకృష్ణ, కాతా దీపికా, ఎంపీపీ కడప లక్ష్మి, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైఎస్సార్ సీపీ నాయకులు కామూరి రమణారెడ్డి, మాజీ సర్పంచి శివాపురం సురేంద్రకుమార్, మాజీ ఎంపీపీ కడప వంశీధరరెడ్డి, వేమిరెడ్డి రామచంద్రారెడ్డి, సీఆర్‌ఐ మురళి, కావేటి ఈశ్వర్‌నాయుడు, చేరెడ్డి శ్రీకాంత్ రెడ్డి, పర్చూరి నాగేశ్వరరావు, డా.భూమా నరసింహారెడ్డి, పాలుగుళ్ల నరసింహారెడ్డి, రాష్ట్ర గౌడసంఘం నాయకుడు కంచర్ల కోటయ్యగౌడ్, ఎదురు శ్రీనివాసరెడ్డి, పెండ్యేల కిరణ్, గర్రె చిరంజీవి, వైఎస్సార్ సీపీ జిల్లా క్రిష్టియన్ మైనారిటీ నాయకుడు గోన రంజిత్ కుమార్, కాపు నాయకుడు ముద్దర్ల శ్రీను పాల్గొన్నారు.



నామినేషన్‌కు పెద్ద ఎత్తున స్వచ్ఛందంగా తరలివచ్చిన ప్రజలు

వైఎస్సార్ సీపీ గెలుపు తథ్యం

- సంతనూతలపాడులో విజయం సాధించి జగనన్నకు బహుమతిగా ఇస్తాం
- వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, మంత్రి మేరుగు నాగార్జున, మాజీ ఎంపీ మోదుగుల వేణుగోపాల్ రెడ్డి
- పార్టీ కార్యాలయం ప్రారంభం



సంతనూతలపాడు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న బాపట్ల పార్లమెంట్ పరిశీలకుడు మోదుగుల వేణుగోపాల్ రెడ్డి, మంత్రి, నియోజకవర్గ అభ్యర్థి మేరుగు నాగార్జున

సంతనూతలపాడు (చీమకుర్తి): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నిర్వహిస్తున్న మేమంతా సిద్ధం బస్సు యాత్ర జన ప్రభంజనం సృష్టిస్తూ దూసుకెళ్తోందని, రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపు తథ్యమని నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి, మంత్రి మేరుగు నాగార్జున, బాపట్ల పార్లమెంట్ పరిశీలకుడు, మాజీ ఎంపీ మోదుగుల వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. సంతనూతలపాడు పంచాయతీ కార్యాలయం సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవంలో శుక్రవారం వారు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో మోదుగుల మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గత ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల్లో 99 శాతం అమలు చేశారని.. చంద్రబాబు తన పాలనలో ఇచ్చిన ఏ ఒక్క హామీనీ నెరవేర్చలేదని చెప్పారు. మళ్లీ ఈ ఎన్నికల్లో ఉత్తుత్తి వాగ్దానాలతో ప్రజలను మభ్యపెట్టేందుకు ముందుకొస్తున్నారని ఎద్దేవా ఏశారు. సీఎం జగన్ పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను ప్రజలకు అందించారన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా నాగార్జునను, ఎంపీ అభ్యర్థిగా నందిగం సురేష్‌ను గెలిపించాలని కోరారు.

మంత్రి మేరుగు నాగార్జున మాట్లాడుతూ సంతనూతలపాడు నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ బలంగా ఉందని, పార్టీ విజయానికి అందరూ కృషి చేయాలని కోరారు. ఈనెల 24 న చీమకుర్తిలో తాను నామినేషన్ వేస్తానని, నియోజకవర్గంలో నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మారెళ్ళ బంగారు బాబు, ఎంపీపీ బీ విజయ, జెడ్పీటీసీలు దుంపా రమణమ్మ, వేమా శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు బొల్లినేని కృష్ణయ్య, సొసైటీ ప్రెసిడెంట్ దుంపా యలమందారెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్పొరేషన్ చైర్మన్, డైరెక్టర్లు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, వైస్ ఎంపీపీలు, పేర్నమిట్టలోని 6 డివిజన్ల కార్పొరేటర్లు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, జేసీఎస్ కన్వీనర్లు, చీమకుర్తి మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అనుబంధ విభాగాల నాయకులు, పీఏసీఎస్ త్రి మెన్ కమిటీ సభ్యులు, సచివాలయ కన్వీనర్లు, పాల్గొన్నారు.

టీడీపీ నేతల కోడ్ ఉల్లంఘన

- నిద్ర నటిస్తున్న ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందం



నిబంధనలకు విరుద్ధంగా అధిక సంఖ్యలో బైక్ ర్యాలీలో పాల్గొన్న టీడీపీ కార్యకర్తల్లో కొంత భాగం

మార్కాపురం: మార్కాపురం పట్టణంలో శుక్రవారం సాయంత్రం నిర్వహించిన టీడీపీ బైక్, ఎన్నికల ర్యాలీలో కోడ్ ఉల్లంఘన జరిగింది. పూర్తి స్థాయిలో పర్యవేక్షించాల్సిన ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందం నిద్ర నటిస్తుండటంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అధికారులు పచ్చ పాతం చూపిస్తున్నారనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కందుల నారాయణ రెడ్డి, ఒంగోలు ఎంపీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసుల రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం మార్కాపురంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఎన్నికల అధికారి నుంచి 65 బైక్‌లకు మాత్రమే అనుమతి తీసుకోగా, బైక్ ర్యాలీలో సుమారు 150కి పైగా బైక్‌లు పాల్గొన్నాయి. పట్టణంలోని పాత బస్టాండ్, నాయుడు వీధి, తేరు బజారు, మెయిన్ బజారుతో పాటు పట్టణమంతా హారన్‌లు మోగిస్తూ ర్యాలీ నిర్వహించినా ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందం ఏమీ పట్టనట్లుగా వ్యవహరించారు. బృందానికి నాయకత్వం వహిస్తున్న వెలిగొండ ప్రాజెక్టులోని అధికారి తీరు విమర్శలకు తావిస్తోంది. కేవలం వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో చేసే ర్యాలీలు, బహిరంగ సభలపై ఫోకస్ పెడుతూ కేసులు నమోదు చేస్తున్న ఆ అధికారి, టీడీపీ నేతలపై ప్రేమ చూపిస్తున్నారని స్పష్టంగా అర్థమవుతోంది. బైక్ ర్యాలీలో అనుమతి కంటే ఎక్కువ వాహనాలు ఉన్నా ఆ అధికారికి కోడ్ ఉల్లంఘన కనిపించటం లేదా అని పలువురు విమర్శిస్తున్నారు. అందుకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తున్నాయి.

క్లుప్తంగా

రేపు పోస్టల్ ఏజెంట్ల జిల్లా సదస్సు

ఒంగోలు సబర్బన్: జిల్లా స్థాయి పోస్టల్ ఏజెంట్ల అసోసియేషన్ జిల్లా సదస్సు ఆదివారం ఒంగోలులో నిర్వహించనున్నట్లు జిల్లా స్మాల్ సేవింగ్స్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు షేక్ దరియా సాహెబ్ తెలిపారు. ఒంగోలు రామ్‌నగర్ ఒకటో లైన్‌లో ఉన్న రైస్ మిల్లర్స్ అసోసియేషన్ హాలులో ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందన్నారు. ఏజెంట్ల అసోసియేషన్ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహిస్తు ఈ కార్యక్రమానికి ప్రకాశం జిల్లా సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టాఫీసెస్(ఎస్ఎస్‌పీ) ఎండి.జాఫర్‌సాదిక్ ముఖ్య అతిథిగా హాజరవుతున్నారన్నారు. సదస్సులో అసోసియేషన్ జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకుంటామన్నారు.

కనిగిరిలో అధికారుల ఓవరాక్షన్

- టీడీపీ నేతల ఫిర్యాదుతో అత్యుత్సాహం?
- ఏకంగా వైఎస్సార్ సీపీ కార్యాలయంలోకి వచ్చి సమావేశాలు పెట్టొద్దంటూ హల్ చల్
- ఆర్వో కార్యాలయానికి 200 మీటర్ల లోపు ఉందని, అనుమతి లేదని వితండవాదం
- కనీస అవగాహన లేకుండా అధికారులు వ్యవహరిస్తున్న తీరుపై విమర్శలు
- రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు చేసిన వైఎస్సార్ సీపీ నాయకులు



ఎంసీసీ నోడల్ అధికారిని అడుగుతున్న చైర్మన్ గఫార్

కనిగిరి రూరల్: ఎన్నికల నిబంధనల పేరుతో కనగిరిలో అధికారులు ఓవరాక్షన్ చేశారు. సీ విజిల్ యాప్‌లో టీడీపీ నేతలు చేసిన ఫిర్యాదుపై కనీస అవగాహన లేకుండా ఏకంగా వైఎస్సార్ సీపీ కార్యాలయంలోకి వచ్చి సమావేశాలు పెట్టొందంటూ దబాయించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. శుక్రవారం కనిగిరిలోని రామయ్య నాయుడు హాస్పిటల్ సెంటర్‌లో ఉన్న వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆ పార్టీ డిప్యూటీ రీజినల్ కోఆర్డినేటర్, ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ నేపథ్యంలో ముందుగా వచ్చిన పార్టీ కార్యకర్తలతో ఆయన మాట్లాడుతుండగా ఎంసీసీ నోడల్ అధికారి(మున్సిపల్ కమిషనర్), స్క్వాడ్ అధికారి(సీడీపీఓ) పోలీసులతో సహా వచ్చారు. 'ఎక్కువ మందితో సమావేశం ఎందుకు నిర్వహిస్తున్నారు. ఇంతమంది గుంపుగా ఉండొద్దు. పర్మిషన్ తీసుకోవాలి' అని ఒక అధికారి, ఎన్నికల నిబంధనావళి ప్రకారం రిటర్నింగ్ అధికారి ఆఫీసుకు 200 మీటర్ల లోపు పార్టీ కార్యాలయం ఉందని ఇంకో అధికారి రగడ చేశారు. సీఐ, ఎస్సైలు కూడా ఎన్నికల నామినేషన్ ముగిసేంత వరకు కార్యాలయం తలుపులు తీయవద్దంటూ హుకుం జారీ చేశారు.

ప్రశ్నించిన నేతలు.. నీళ్లు నమిలిన అధికారులు

వైఎస్సార్ సీపీ కార్యాలయానికి కార్యకర్తలు రాకూడదని ఏ నిబంధనల ప్రకారం చెబుతున్నారని అధికారులను ఆ పార్టీ నేతలు, పీడీసీసీబీ చైర్మన్ వైఎం ప్రసాద్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ ప్రశ్నించారు. ఆర్వో కార్యాలయానికి పార్టీ ఆఫీస్ 200 మీటర్ల బయటే ఉందని, కావాలంటే కొలతలు వేసుకోవాలని చెప్పారు. తమ కార్యాలయంలో ముఖ్యులతో సమావేశం నిర్వహణకు అనుమతి తీసుకోవాలని చెప్పడం హాస్యాస్పదంగా ఉందని, టీడీపీ నేతల ఫిర్యాదుతో పార్టీ ఆఫీసు వద్దకు రావడం సరికాదన్నారు. నిబంధనలు చెప్పాలంటూ వైఎస్సార్ సీపీ నేతలతోపాటు అక్కడే ఉన్న విలేకర్లు ప్రశ్నించడంతో ఉన్నతాధికారుల ఆదేశాలతో వచ్చామంటూ అధికారులు ముక్తాయించి వెనుదిరిగారు.

ఆర్వోకు ఫిర్యాదు

నిబంధనల పేరుతో తమ కార్యాలయం వద్దకు వచ్చి కొందరు అధికారులు అనవసరం రాద్ధాంతం చేయడంపై వైఎస్సార్ సీపీ నేతలు ఎస్‌కే అబ్దుల్ గఫార్, పీడీసీసీబీ చైర్మన్ గఫార్, జెడ్పీటీసీ కస్తూరిరెడ్డి, చింతం శ్రీను తదితరులు ఆర్డీఓ, ఎన్నికల రిటర్నింగ్ అధికారి పి.జాన్ ఇర్విన్‌కు ఫిర్యాదు చేశారు. కనీస అవగాహన లేకుండా నిబంధనల పేరు చెప్పి రచ్చ చేయడంపై తీవ్ర అభ్యంతరం తెలిపారు. నిజంగా నిబంధనలకు విరుద్ధంగా ఉంటే కొలతలు వేసి చూపాలని, టీడీపీ నేతల ఫిర్యాదుతో అధికారులు అత్యుత్సాహం ప్రదర్శించడం మంచి పద్ధతి కాదని పేర్కొన్నారు.

అధికారుల తీరుపై ప్రజల ఆగ్రహం

ఎన్నికల నిబంధనల పేరుతో కనిగిరిలో అధికారులు వ్యవహరిస్తున్న తీరుపై ప్రజలు తీవ్రంగా మండిపడుతున్నారు. రిటర్నింగ్ అధికారి కార్యాలయ ప్రాంగణంలోని ఎంపీడీఓ, తహసీల్దార్, సబ్ రిజిస్ట్రార్, ట్రెజరీ, ఐసీడీసీఎస్ కార్యాలయాలకు ప్రజలతోపాటు ఉద్యోగులు కూడా వెళ్లకుండా అడ్డుకోవడం సర్వత్రా చర్చనీయాంశమైంది. 200 మీటర్ల దూరం నిబంధన పేరుతో ప్రధాన రహదారికి ఇరువైపులా బారికేడ్లు ఏర్పాటు చేయడంతో డిపో వద్ద నుంచి పట్టణంలోకి వచ్చేందుకు వృద్ధులు, మహిళలు చంటి పిల్లలతో నానా అవస్థలు పడుతున్నారు. గతంలో ఎన్నడూ లేని నిబంధనలు ఇప్పుడే ఎందుకని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

నాడు కానిస్టేబుల్.. నేడు బాస్



ర్యాంకు సాధించిన ఉదయ్ కృష్ణా రెడ్డిని సన్మానిస్తున్న ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్

ఒంగోలు సబర్బన్: గతంలో చిరు ఉద్యోగిగా ఉన్న వ్యక్తి నేడు దేశ అత్యున్నత సివిల్ సర్వీసెస్‌లో ప్రతిభ చాటాడు. యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించిన సివిల్ సర్వీసెస్–2023 లో ఉత్తమ ర్యాంకు సాధించిన ఎం.ఉదయ్ కృష్ణా రెడ్డి గతంలో సాధారణ కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తించాడు. కానీ పట్టుదలతో నేడు ఈ స్థాయికి చేరుకున్నాడు. సివిల్ సర్వీసెస్ ఆల్ ఇండియా ఫలితాల్లో 780వ ర్యాంకు సాధించిన ఉదయ్ కృష్ణా రెడ్డిది సింగరాయకొండ మండలం ఊళ్ళపాలెం గ్రామం. ఈ సందర్భంగా ఎస్పీ గరుడ్ సుమిత్ సునిల్ స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలోని తన చాంబర్‌లో శుక్రవారం ఉదయ్ కృష్ణా రెడ్డిని సన్మానించారు. ఎస్పీ మాట్లాడుతూ నేటి యువత ఉదయ్ కృష్ణా రెడ్డిని స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. తాను 2013 నుంచి 2018 వరకు ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని గుడ్లూరు పోలీస్ స్టేషన్, రామాయపట్నం మెరైన్ పీఎస్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తించానన్నారు. ఐఏఎస్ సాధించిన రేవు ముత్యాల రాజును స్ఫూర్తిగా తీసుకొని సివిల్స్‌కు సిద్ధమయ్యానన్నారు. అందుకోసం 2018లో కానిస్టేబుల్ ఉద్యోగానికి రాజీనామా చేసి పట్టుదలతో చదివానన్నారు. తన చిన్నప్పుడే తల్లి దండ్రులు చనిపోయారని, నాయనమ్మ రమణమ్మ తనను తీర్చిదిద్దారని చెప్పారు.

మాయా ఉందీ.. మంత్రం ఉందీ!

- పార్టీతో సంబంధం ఉన్న వారికే మళ్లీ పచ్చ కండువాలు
- ప్రలోభాలతో 10 మందిని చేర్చుకుని..100 కుటుంబాలు అంటూ గోబెల్స్ ప్రచారం
- టీడీపీ తీరుపై అంతా విస్మయం



టీడీపీ వారినే అదే పార్టీలో చేర్చుకుంటున్న నేతలు

పొదిలి రూరల్: గత సార్వత్రిక ఎన్నికల్లో చావుదెబ్బ తిన్న టీడీపీకి మళ్లీ ఊపిరి పోయడానికి ఆ పార్టీ నాయకులు ఫేక్ చేరికలను నమ్ముకుంటున్నారు. ఇప్పటికే టీడీపీతో ఉన్న వారికే మళ్లీ పచ్చ కండువాలు కప్పుతున్నారు. సొంత ప్రయోజనాలు కోసం అధికార వైఎస్సార్ సీపీ పంచన కొన్నేళ్లు గడపిన వారిని కూడా నిస్సిగ్గుగా పార్టీలోకి చేర్చుకుంటున్నారు. వారిని వైఎస్సార్‌సీపీ నాయకులుగా చూపించి వలస వచ్చేస్తున్నారంటూ ఫోటోలు తీయించి ప్రచారం చేసుకుంటున్నారు. పొదిలి మండలంలోని టీ సల్లూరు, ఏలూరు, ఉప్పలపాడు, తలమళ్లలో టీడీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు మాగుంట శ్రీనివాసరెడ్డి, కందుల నారాయణరెడ్డి గురువారం రాత్రి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టి–సల్లూరు, ఏలూరు, ఉప్పలపాడు, గోగినేనివారిపాలెంలో ఎవరూ ఏ పార్టీలో చేరలేదు. కానీ తలమళ్లలో మాత్రం 100 కుటుంబాలు వైఎస్సార్ సీపీ నుంచి టీడీపీలో చేరాయంటూ గోబెల్స్ ప్రచారం చేసుకుంటూ సంబరాలు చేసుకున్నారు. తలమళ్లలో మొత్తం 1500 మంది ఓటర్లున్నారు. గత పంచాయతీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి 460 ఓట్ల మెజార్టీ వచ్చింది. తలమళ్ల పంచాయతీకి పక్కనున్న ఉప్పలపాడు చెందిన ఉలవా గోపి నిన్నటి వరకు వైఎస్సార్‌సీపీలో ఉండి, పార్టీ ద్వారా ప్రయోజనం పొందాడు. అవసరం తీరాక తల్లి పాలు తాగి రొమ్ము గుద్దిన సామెతగా ఇటీవల చంద్రబాబు నాయుడు మార్కాపురం వచ్చినప్పుడు ఆయన సమక్షంలో టీడీపీలో చేరాడు. సొంత ప్రయోజనాల కోసం వైఎస్సార్ సీపీ పంచన కొన్నేళ్ళు గడిపిన ముప్పరాజు శ్రీను.. ఎప్పటి నుంచో టీడీపీతో అంట కాగుతున్న ఇప్పుడు పార్టీ మారినట్లు నిస్సిగుగా చెబుతున్నారు. ఉలవా గోపి తన బలం నిరుపించుకోనే దానికి ఇటువంటి గోబెల్స్ ప్రచారానికి తెరలేపాడు. ఆయనకు అంతబలం ఉంటే స్వంత పంచాయతీ అయిన ఉప్పలపాడు, గోగినేనివారిపాలెంలో పార్టీలో చేర్పించాలి. అలా కాకుండా తలమళ్ళ పంచాయతీలోని ఫిర్‌దొసినగర్‌లో చేరికలకు ప్రోత్సహించాడు. ఎందుకుంటే అక్కడ ఉన్న వారు చాలా నిరుపేదలు. వారిని మాయ మాటలతో పార్టీలో చేర్చాలనుకున్నాడు. కానీ ఆయన మాటలను నమ్మలేదు. వారిలో 10 మందిని ప్రలోభాలకు పెట్టి చేర్చుకున్నారు. ఆ 10 మందితో పాటు ఆదే పార్టీలో ఉన్న కొంతమందికి కండువాలు కప్పి ఫొటోలు తీయించి 100 కుటుంబాలు చేరినట్లుగా గొబెల్స్ ప్రచారం చేసుకొని సంబరపడుతున్నారు. దీనిపై వైఎస్సార్ సీపీ ఘాటుగా స్పందించింది. దమ్ముంటే 100 కుటుంబాలు పేర్లు బయట పెట్టి నిరూపించాలని నేతలు సవాల్ విసిరారు.

టీడీపీ ప్రచారంలో కాంట్రాక్టు ఉద్యోగి



మల్లారెడ్డిపల్లెలో టీడీపీ బహిరంగ సభలో పాల్గొన్న శన్నుబాబు (వృత్తంలో ఉన్న వ్యక్తి)

కొమరోలు: కాంట్రాక్టు ఉద్యోగులు టీడీపీ జెండాలు మోస్తూ ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నారు. మొన్న కొమరోలు మండలంలోని అక్కపల్లెలో ఓ కాంట్రాక్టు ఉద్యోగి ఎన్నికల ప్రచారంలో పాల్గొనగా మరోసారి మల్లారెడ్డిపల్లెలో ఇదే ఘటన చోటుచేసుకుంది. కొమరోలు మండల పరిషత్ కార్యాలయంలో కాంట్రాక్టు కంప్యూటర్ ఆపరేటర్‌గా శన్నుబాబు పనిచేస్తున్నాడు. ఇటీవల ఎన్నికల ప్రచారం నిమిత్తం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి పర్యటించగా శన్నుబాబు ముఖానికి కర్చీఫ్ కట్టుకుని ప్రచారంలో పాల్గొన్నాడు. వారం రోజుల క్రితమే శన్నుబాబు కుటుంబసభ్యులను టీడీపీలోకి చేరారు. సంబంధిత అధికారులు శన్నుబాబుపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కంభంలో...

కంభం: కందులాపురం పంచాయతీ కార్యాలయంలో కాంట్రాక్ట్ ఉద్యోగిగా పనిచేస్తున్న చింతన బోయిన శ్రీనివాసులు టీడీపీ కార్యక్రమాల్లో పాల్గొంటున్నా అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. శుక్రవారం సాయంత్రం టీడీపీ నాయకులు కాంట్రాక్ట్ ఉద్యోగి శ్రీనివాసులు నివాసం ఉండే ప్రాంతంలో ప్రచారం నిర్వహించనున్న నేపథ్యంలో టీడీపీ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. అదే సమయంలో పార్టీ కార్యాలయానికి వచ్చిన శ్రీనివాసులు...సుమారు గంట పాటు అక్కడే ఉన్నాడు. కాంట్రాక్ట్ ఉద్యోగిగా పనిచేస్తూ బహిరంగా టీడీపీ నాయకులతో చెట్టాపట్టాలేసుకొని తిరుగుతున్నా అతనిపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



టీడీపీ కార్యాలయంలో ఫోన్‌లో మాట్లాడుతున్న కాంట్రాక్టు ఉద్యోగి శ్రీనివాసులు

వలంటీరూ.. ఇదేం తీరు!



టీడీపీ బైక్ ర్యాలీలో పాల్గొన్న వలంటీర్

మార్కాపురం: పట్టణంలో శుక్రవారం సాయంత్రం టీడీపీ బైక్ ర్యాలీ జరిగింది. అయితే మార్కాపురం మండలం గోగుల దిన్నె (కంది వారి పల్లి) గ్రామానికి చెందిన పల్లపోలు వెంకట శ్రీనివాస్ రెడ్డి అనే వలంటీర్ ఈ ర్యాలీలో పాల్గొని బాబుకు వీరవిధేయుడినంటూ హంగామా చేశాడు.

ఆది నుంచి ఉగ్రది దొడ్డిదారే



మాట్లాడుతున్న టీజేఆర్ సుధాకర్ బాబు

- కార్యకర్తలంతా సైనికుల్లా పనిచేయండి
- ఉగ్రకు మరోసారి గుణపాఠం చెప్పాలి
- వైఎస్సార్ సీపీ రీజనల్ డిప్యూటీ కో ఆర్డినేటర్ టీజేఆర్ సుధాకర్‌బాబు

కనిగిరి రూరల్: 'టీడీపీ నాయకుడు ఉగ్రది ఆది నుంచి దొడ్డి దారే. అతనికి మళ్లీ తగిన గుణపాఠం చెప్పి అసెంబ్లీలో అడుగుపెట్టనీయకుండా ఇంటికే పరిమితం చేయాలని వైఎస్సార్‌సీపీ రీజనల్ డిప్యూటీ కో ఆర్డినేటర్, ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్ బాబు అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్‌గఫార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీ నేత ఉగ్ర నరసింహారెడ్డి ఇటీవల ఒక కార్యక్రమంలో పింఛన్లపై అహంకారపూరితంగా మాట్లాడడన్నారు. వైఎస్సార్ సీపీ అభిమానులంతా మరోసారి ఓటు అనే ఆయుధంతో తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.

కార్యకర్తలంతా సైనికుల్లా పనిచేయాలి

వైఎస్సార్ సీపీ కార్యకర్తలంతా సైనికుల్లా పనిచేసి సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికి వివరించి ఓటును అభ్యర్థించాలన్నారు. క్షేత్ర స్థాయిలో నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి ఓటర్లను కలవాలన్నారు. బూత్‌ల వారీగా సమష్టి ప్రణాళికతో పనిచేయాలని సూచించారు. పార్టీ శ్రేణులంతా సమష్టిగా పనిచేసి దద్దాల నారాయణను ఎమ్మెల్యేగా, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని ఎంపీగా అత్యధిక మెజార్టీతో గెలిపించి జగనన్నను మళ్లీ సీఎం చేసుకుందాం అని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రెడ్డి కార్పొరేషన్ చైర్మన్, పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు చింతలచెరువు సత్యన్నారాయణరెడ్డి, పీడీసీసీబీ చైర్మన్ వైఎం ప్రసాద్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ చింతగుంట్ల సాల్మన్ రాజు, ఎంపీపీ దంతులూరి ప్రకాశం, గాయం సావిత్రి, రామన తిరుపతిరెడ్డి, అత్యాల జఫన్య, జెడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి, వాసవీసత్ర సముదాయ జాతీయ అధ్యక్షుడు దేవకి వెంకటేశ్వర్లు, ఎస్ మోహన్‌రెడ్డి, ఎస్‌కే జిలాని, లక్ష్మీ మోహన్, వైస్ చైర్మన్లు పులికాంతి గోవర్ధన్‌రెడ్డి, ఆర్ మాణిక్యరావు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీని గెలిపిస్తేనే అభివృద్ధి

- మంత్రి, కొండపి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ఆదిమూలపు సురేష్
- మర్లపాడులో పల్లె పల్లెకు సిద్ధం



మర్లపాడులో పల్లె పల్లెకు సిద్ధం నిర్వహిస్తున్న మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్

టంగుటూరు: అన్ని వర్గాల అభివృద్ధి వైఎస్సార్ సీపీతోనే సాధ్యమని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి, కొండపి వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. మండలంలోని మర్లపాడు గ్రామంలో మంత్రి పల్లె పల్లెకు సిద్ధం శుక్రవారం నిర్వహించారు. పార్టీ నాయకులు మంత్రికి ఘనంగా స్వాగతం పలికారు. ఆయన మాట్లాడుతూ చంద్రబాబు కులాల మధ్య చిచ్చు పెట్టి ఓటు బ్యాంకుగా వాడుకుంటే, సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వచ్చిన తర్వాత వారు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా ఎదిగేందుకు కృషి చేశారన్నారు. మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు నవరత్నాల్లో భాగస్వాములను చేశారన్నారు. ఎన్నికల కమిషన్‌కు వలంటీర్లపై ఫిర్యాదు చేసి.. అవ్వా తాతలకు ఇంటి వద్ద పింఛను రానివ్వకుండా, సచివాలయాల వద్ద తీసుకునేలా చేశారన్నారు. అలా మండుటెండకు రాష్ట్రంలో 30 మంది ముసలి వారిని బాబు పొట్టన పెట్టుకున్నాడన్నారు. ఈ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని గెలిపిస్తేనే కొండపి నియోజకవర్గంలో అభివృద్ధిలో ముందుకెళ్తుందని చెప్పారు. రెండు దఫాలుగా టీడీపీ ఎమ్మెల్యే స్వామి ఉన్నారని.. నియోజకవర్గంలో ఒక్క అభివృద్ధి పని అయినా చేశారా అని ప్రశ్నించారు. ఎంపీగా చెవిరెడ్డి భాస్కరరెడ్డికి, ఎమ్మెల్యేగా తనకు అవకాశం ఇవ్వాలని కోరారు. పార్టీ మండల అధ్యక్షుడు మల్లవరపు రాఘవరెడ్డి, జెడ్పీటీసీ మన్నం అరుణకుమారి, సర్పంచ్ తాళ్ళూరి ఆశీర్వాదం, సింగమనేని బ్రహ్మయ్య, ఈదర అమర్నాథ్, బొల్లినేని వెంకటేశ్వర్లు, బుర్రా రవి, బత్తుల రవణయ్య, బత్తుల మంగమ్మ, కొర్లపాటి శ్రీను, మేకా పోలయ్య, బుర్రా వెంకటేశ్వర్లు, మన్నం వెంకయ్య, అంగలకుర్తి మహేష్, కొమ్ము కోటేశ్వర రావు, రామపాటి లక్ష్మయ్య, కొమ్ము శ్రీను, రాయపాటి పురుషోత్తం, దేవదాసు, గుంటు యోహాను, బొట్ల సుబ్బారావు, పాటుబంద్ర బ్రహ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఇంటి దొంగలకు అరదండాలు

- 20 గంటల్లో భారీ నగదు కేసు ఛేదించిన పోలీసులు
- ఏటీఎంలలో నగదు నింపే వాహనంలో అపహరణకు గురైన నగదు
- రూ.66 లక్షలు స్వాధీనం
- వాహనంలో పనిచేసే ఉద్యోగులే సూత్రధారులు
- రోజు గడవక ముందే అదుపులోకి నిందితులు
- వివరాలను వెల్లడించిన ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్, పక్కన ఏఎస్పీ శ్రీధర రావు, డీఎస్పీ, సీఐ



స్వాధీనం చేసుకున్న నగదును పరిశీలిస్తున్న ఎస్పీ సుమిత్ సునీల్, ఏఎస్పీ

ఒంగోలు సబర్బన్: నగరంలో సంచలనం సృష్టించిన ఏటీఎంలలో నగదు నింపే వాహనంలో అపహరణకు గురైన కేసును ఒంగోలు పోలీసులు 20 గంటల్లోనే ఛేదించారు. రోజు గడవకు ముందే నగదును స్వాధీనం చేసుకున్నారు. జిల్లా అడిషనల్ ఎస్పీ (క్రైమ్స్)ఎస్‌వీ శ్రీధర రావు నేతృత్వంలోని బృందం గురువారం సాయంత్రం నుంచే రంగంలోకి దిగి అత్యంత వేగంగా కేసును ఛేదించారు ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్ జిల్లా పోలీస్ కార్యాలయంలోని గెలాక్సీ భవన్‌లో శుక్రవారం వివరాలు వెల్లడించారు. ఒంగోలు నగరంతో పాటు జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఏటీఎంలలో నగదు నింపే క్యాష్ మేనేజ్‌మెంట్ సర్వీసెస్ ఇన్‌ఫో సిస్టమ్స్ లిమిటెడ్ (సీఎంఎస్‌కు చెందిన వాహనం గురువారం మధ్యాహ్నం కర్నూలు రోడ్డులోని ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంకు కాంపౌండ్‌లో ఉన్న పంజాబ్ నేషనల్ బ్యాంకు ఏటీఎంలో నగదు నింపేందుకు వచ్చింది. సీఎంఎస్ సెక్యూరిటీ సంస్థ సిబ్బంది వివిధ బ్యాంకుల నుంచి మొత్తం రూ.68 లక్షలు నగదు వాహనం (ఏపీ16 టీడీ 7552)లో ఉంచి దాన్ని అక్కడే ఆపి గురువారం మధ్యాహ్నం 2.30 గంటలకు భోజనం చేయటానికి పెట్రోల్ బంకు వెనక్కు వెళ్లారు. భోజనం చేసి వచ్చి చూసే సరికి వాహనం వెనుక తాళం తీసి ఉండటాన్ని గమనించారు. దీంతో లోపల నగదు అపహరణకు గురైనట్లు సిబ్బంది గుర్తించి మేనేజర్ గుజ్జుల వెంకట కొండారెడ్డికి తెలపడంతో ఆయన తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫింగర్ ప్రింట్ నిపుణులు వచ్చి ఆధారాలు సేకరించారు.

గాలింపు చేపట్టిన నాలుగు ప్రత్యేక బృందాలు

ఏఎస్పీ (క్రైమ్స్) ఎస్‌వీ శ్రీధర రావు ఆధ్వర్యంలో ఒంగోలు తాలూకా సీఐ భక్తవత్సల రెడ్డి అపహరణకు గురైన నగదును పట్టుకోవటానికి ప్రత్యేకంగా నాలుగు పోలీస్ బృందాలను ఏర్పాటు చేర్పాటు చేశారు. అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టిన పోలీసులకు.. సీఎంఎస్ సంస్థలో పనిచేస్తున్న, పనిచేసి మానేసిన సిబ్బందిపై అనుమానం కలిగింది. పెట్రోలు బంకులోని సీసీ ఫుటేజీ ఆధారంగా నగదు అపహరించిన వ్యక్తులను గుర్తించే పనిలో నిమగ్నమయ్యారు. సంస్థలో పనిచేసి మానేసిన సంతనూతలపాడు మండలం కామేపల్లివారి పాలెం గ్రామానికి చెందిన సన్నమూరు మహేష్ బాబును శుక్రవారం ఉదయం పేర్నమిట్ట శివారులోని ఎన్ఎస్‌పీ కెనాల్ వద్ద అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద ఉన్న రూ.66 లక్షల నగదుతో పాటు అతని ద్విచక్ర వాహనాన్ని కూడా స్వాధీనం చేసుకున్నారు. నగదు అపహరణకు సహకరించిన.. పోలీసులకు ఫిర్యాదు చేసిన గుజ్జుల వెంకట కొండారెడ్డి, రాచర్ల రాజశేఖర్‌లను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సంస్థ మేనేజర్‌గా పని చేస్తూనే సంస్థకు చెందని నగదు అపహరించడం గమనార్హం.

సిబ్బందిని అభినందించిన ఎస్పీ

కేసును అత్యంత వేగంగా ఛేదించినందుకు ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్ పోలీస్ అధికారులను, సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు. ఏఎస్పీ శ్రీధర రావు, ఒంగోలు డీఎస్పీ ఎం.కిషోర్ బాబు, ఒంగోలు తాలూకా సీఐ భక్తవత్సల రెడ్డి, సీసీఎస్ ఎస్సై టి.విజయ కృష్ణ, సైబర్ సెల్ సీఐ సూర్య నారాయణ, తాలూకా ఎస్సైలు పున్నారావు, విజయ కుమార్, మద్దిపాడు ఎస్సై మహేష్, ఏఎస్సై టి. బాలాంజనేయులు, నాగేశ్వరరావు, సురేష్ బాబు, రమేష్ బాబుతో పాటు పోలీస్ సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు. అందరికీ పోలీస్ నగదు రివార్డులు, ప్రశంస పత్రాలు అందజేశారు.